క్లుప్తంగా

నవాబ్‌పేటలో పోషణ్ అభియాన్



చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేటలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులకు సీమంతం చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్, గ్రామ సర్పంచ్ సుద్దాల ప్రవీణ్‌కుమార్, ఏసీడీపీఓ అరవింద, సూపర్‌వైజర్లు ఇందిర, రాజ శ్రీ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు ఖాతాల్లో జమచేయాలి

రామడుగు: రైతుల ధాన్యం డబ్బులు ప్రభుత్వం తక్షణమే రైతుల ఖాతాల్లో జమచేయాలని కోరుతూ బుధవారం మండల బీజేపీ నాయకులు తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసి నెలరోజులు గడుస్తున్నా ఇంతవరకు జమ కాకపోవడంతో విత్తనాల కొనుగోలు, పెట్టుబడికి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఒంటెల కరుణాకర్ రెడ్డి, కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు, లక్ష్మణాచారి, శ్రీనివాసాచారి, చంద్రమోహన్, ఎల్లయ్య, కనకయ్య పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

చిగురుమామిడి: మండలంలోని ఒగులాపూర్ గ్రామంలో ఘనంగా బొడ్రాయి (శ్రీలక్ష్మీ, భూలక్ష్మీ) విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం అర్చకులు రాజన్న శర్మ, కిరణ్‌శర్మ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీలక్ష్మీ, భూలక్ష్మీ, విగ్రహాలను ప్రతిష్ఠించారు. బొడ్రాయి పునఃప్రతిష్ఠాన సందర్భంగా గ్రామానికి చెందిన ఏలేటి అంజిరెడ్డి అశోక్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.50వేలను విరాళం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బోయిని శ్రీనివాస్, ఉపసర్పంచ్ కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ కోమటిరెడ్డి చంద్రకళ రాం గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కోమటిరెడ్డి జయ్‌పాల్ రెడ్డి, రిటైర్డ్ ఆర్డీఓ ఈశ్వరయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


'విజయవంతం చేయాలి'

రామడుగు: బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 30వరకు నిర్వహిస్తున్న మహజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాలను కార్యకర్తలు విజయవంతం చేయాలని బీజేపీ మోర్చాల సంయుక్త సమ్మేళనం కో ఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి కోరారు. మండలకేంద్రంలో బుధవారం మహజన్ సంపర్క్ అభియాన్ వివిధ మోర్చాల సంయుక్త సమావేశం జరిగింది. కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడుతూ... ఈనెల 12న, కొండగట్టులో నిర్వహిస్తున్న అభియాన్ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ హజరుకానున్నారని, సమావేశంలో బీజేపీ నాయకులు చంటి జితేందర్, కడార్ల స్వామి, ఎడవెల్లి రాజిరెడ్డి, చంటి జితేందర్, భాస్కరాచారి, లక్ష్మీ, కుమార్, ఎల్లయ్య, వేణు, పలువురు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల వసతులు

రామడుగు : మండలంలోని చిప్పకుర్తి, షానగర్ గ్రామాల్లో రామడుగు జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో తమ విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో సకల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాఠశాలలోవిద్యాబోధన తదితర వసతుల కల్పన గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రేమ్ సాగర్, రమేశ్, భూపతి, రాజేందర్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి బోనాలు



నెత్తిన బోనాలతో గ్రామస్తులు


మానకొండూర్: మండలంలోని ఖాదర్ గూడెంలో ఎల్లమ్మ తల్లి బోనాలను యాదవ కులస్తులు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

'పట్టు' సాగులో ఆదర్శం

- ఐదేళ్లుగా సెరీకల్చర్ సాగు
- నెలకు లక్ష వరకు ఆదాయం
- ఆదర్శంగా నిలుస్తున్న కిషన్‌రెడ్డి



సాగుచేసిన మల్బరీ తోట



షెడ్డులో తయారైన పట్టు గూళ్లు(కకూన్స్)

రామడుగు: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పాటు ఐదేళ్ల క్రితం సెరికల్చర్ గురించి తెలుసుకున్నాడు. పట్టుగూళ్ల పంటను సాగుచేసి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన రైతు ఎడవెల్లి కిషన్‌రెడ్డి.

మొదట రెండెకరాల్లో

మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన రైతు ఎడవెల్లి కిషన్‌రెడ్డి 2018వ, సంవత్సరంలో ఎస్–1 రకం మల్బరీ మొక్కలను రెండు ఎకరాల్లో పంట సాగుచేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో పంట సాగు చేసి మంచి ఫలితాలను సాధించారు.

ప్రత్యేక షెడ్డు ఏర్పాటు..

తనకున్న పంటపొలంలో 50 ఫీట్లు పొడవు, 21 ఫీట్లు వెడల్పుతో పట్టుపురుగుల పెంపకం కోసం ప్రత్యేకంగా షెడ్డును ఏర్పాటు చేసి పంట సాగుచేశారు. ఈ షెడ్డులో సెంట్రల్ సిల్క్ బోర్డు బెంగళూరు వారు అందిస్తున్న పట్టు పురుగుల గుడ్లను తీసుకొచ్చి పెంపకం చేపట్టారు. కాగా మల్బరీ తోటలోని ఆకులను ఉదయం, సాయంత్రం అందిస్తారు. పట్టు పురుగు గుడ్లు తీసుకువచ్చి షెడ్డులో వేసి వాటికి మల్బరీ ఆకులను అందించడంతో దాదాపు 25 రోజుల్లో కకూన్స్ (పట్టు గూళ్లు) తయారవుతుండగా మార్కెట్‌కు తీసుకెళ్లనున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపాడు.

జనగామ, సికింద్రాబాద్ మార్కెట్లలో అమ్మకం

పట్టుగూళ్ల తయారు కాగానే జనగామ, సికింద్రాబాద్‌లోని తిరుమల గిరిలో ఉన్న ప్రభుత్వ మార్కెట్‌కు తరలించి అమ్మకాలు చేస్తున్నట్లు తెలిపారు. కాగా కిలో పట్టుగూళ్లకు దాదాపుగా రూ. 500 వరకు ధర పలుకుతుందని చెబుతున్నాడు. ప్రతినెలా రెండునుంచి 2.50 క్వింటాళ్ల వరకు పట్టుగూళ్ల దిగుబడి వస్తున్నట్లు కిషన్‌రెడ్డి ‘సాక్షి’కి తెలిపారు.

ప్రభుత్వ ప్రోత్సాహం..

ప్రభుత్వం పట్టు పరిశ్రమల శాఖ నుంచి షెడ్డు నిర్మాణం కోసం రూ.రెండు లక్షలు సబ్సిడీని అందజేయడంతో పాటుగా, ప్రతి కిలో కకూన్స్ (పట్టు గూళ్లు)కు రూ.75 ప్రోత్సాహం కింద రైతులకు అందజేస్తుంది. మల్బరీ తోటకు అవసరమైన మందులతో పాటుగా షెడ్డులో శుభ్రత కోసం వినియోగించే మందులను 50 శాతం రాయితీపై అందిస్తారు.

ఐదేళ్లుగా సాగు చేస్తున్నా



2018లో నుంచి పట్టు గూళ్ల సాగు చేస్తున్నా. ప్రారంభంలో పంట సాగులో అనుభవం లేక కొంత ఇబ్బంది కలిగింది. నెలకు రూ.80 వేల నుంచి రూ. లక్ష వరకు పంట (పట్టుగూళ్లు) అమ్మితే వస్తున్నాయి. వరిపంటకు బదులు దీనిపై రైతులు దృష్టిసారిస్తే మంచి ఫలితాలు సాధించొచ్చు. కాగా సెరికల్చర్ అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

– ఎడవెల్లి కిషన్‌రెడ్డి, రైతు, గోపాల్‌రావుపేట

సాగునీటి రంగంలో దేశానికే ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: సాగునీటి రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని కురిక్యాల గ్రామంలో శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో సాగునీటి దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం సాధించుకోకముందు బీడువారిన భూములు సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టితో సాగునీటి రంగంలో తీసుకువచ్చిన మార్పులతో పచ్చని పంటపొలాలతో కళకళలాడుతుందన్నారు. శ్రీరాంసాగర్ నుంచి మిడ్ మానేర్ డ్యాం వరకు నిర్మించిన వరదకాలువ 365 రోజులు నీటితో నిండి ఉండటంతో పాటు, కాలువకు నిర్మించిన తూముల ద్వారా దిగువ ప్రాంత పంటలకు, చెరువులు, కుంటలకు నీరు చేరుతుందన్నారు. వివిధ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయంలో పూజలు..

చొప్పదండి: మండలంలోని వెదురుగట్ట గ్రామంలో జరిగిన బీరప్ప పట్నాల కార్యక్రమంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, ఎంపీపీ చిలుక రవీందర్ పాల్గొని పూజలు నిర్వహించారు. యాదవ సంఘం మహిళలు బోనాలతో ర్యాలీగా తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

పరామర్శ

మండలంలోని గుమ్లాపూర్ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వెల్మ రఘుపతి రెడ్డికి మాతృవియోగం కాగా ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. విశ్రాంత సీఐ మాచర్ల శశికుమార్ ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. పీఏసీసీఎస్ చైర్మన్ మినుపాల తిరుపతి రావు, వెల్మ బాపురెడ్డి, వెల్మ నందిరెడ్డి, వెల్మ శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిగౌడ్, రాజశేఖర్, కుమార్, కర్ర సందీప్, హనుమంతు, ఆనంద్, రాజమౌళి, తదితరులున్నారు.

దేశానికి ఆదర్శంగా సాగునీటి ప్రాజెక్టులు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట: దేశానికి ఆదర్శంగా సాగునీటి ప్రాజెక్టులను నిర్మాణం చేశారని, తెలంగాణలో సాగు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని స్వాతి గార్డెన్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సాగునీటి దినోత్సవం, చెరువుల పండుగపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయనతోపాటు రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, ఈఎల్‌సీ శంకర్ హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. నియోజకవర్గంపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ గుజరాత్‌లో అభివృద్ధిలో చేశారనా అని ప్రశ్నించారు. బీజేపీకి గుణపాఠం చెప్పాలని అన్నారు. చెరువుల పండుగను అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, కరీంనగర్ డీసీపీ మహేశ్, ఏసీపీ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, హుజూరాబాద్ ఎంపీపీ రాణి, ఇరిగేషన్, రెవెన్యూ, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేత

జమ్మికుంట: మండలంలోని మాచనపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన పొల్సాని శ్రీధర్ రావు రూ.20,116, పోల్సాని పెద్ద లింగారావు రూ.10,116, పర్లపల్లి రాజేంద్రప్రసాద్ రూ.10,116, పోల్సాని చిన్న లింగారావు రూ.10,116, కన్నూరి సంతోష్ రూ.10,116లను విరాళంగా అందించారు. కమిటీ సభ్యులు బొజ్జం తిరుపతిరెడ్డి, కనవేన రాజమల్లు, పర్లపల్లి రమేశ్, నాగరాజు, ఒరుగంటి రవీందర్ రావు, అశోక్, పోతరాజు కుమారస్వామి, భిక్షపతి, సాంబమూర్తి గ్రామస్తులు పాల్గొన్నారు.

పోశమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

రామడుగు: మండలంలోని మోతె గ్రామపరిధి గాండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన పోశమ్మ తల్లి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బోనాలతో తరలివెళ్లి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయలో ప్రత్యేకంగా పూజలు చేశారు. ఎంపీపీ కలిగేటి కవిత లక్ష్మణ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అజయ్‌రెడ్డి, రుద్రారం సర్పంచ్ అమరేందర్ రెడ్డి, గౌడ సంఘం అధ్యక్షుడు తిరుపతి గౌడ్, మహేశ్, మల్లేశం, ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతులు చేపట్టాలని వినతి

చొప్పదండి: పట్టణంలోని రెండోవార్డులో ఎన్‌టీఆర్ చౌరస్తా నుంచి మార్కెట్ యార్డు వరకు ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వార్డు కౌన్సిలర్ మాడూరి శ్రీనివాస్ ట్రాన్స్‌కో ఏఈ భూమయ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. విరిగిన కరెంట్ పోల్స్, వేలాడే వైర్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మరమ్మతులు చేయాలని కోరారు.

పుస్తెమెట్టెలు అందజేత

శంకరపట్నం: మండలంలోని ధర్మారంలో బుధవారం సొల్లేటి తిరుమల– శ్రీనివాస్ దంపతుల కూతురు నందిని వివాహం జరగగా వధువుకు బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు పుస్తెమట్టెలు అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనిల్, జిల్లా అధికార ప్రతినిధి సమ్మిరెడ్డి, నరేందర్, శ్రీకాంత్, సంపత్‌రెడ్డి, రాజిరెడ్డి, వీరార్జున్, సారయ్య ఉన్నారు.

గ్యాస్ వాడకంపై అవగాహన

హుజూరాబాద్‌రూరల్ : పట్టణంలోని గ్యాస్ గోదాం ఆవరణలో బుధవారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గ్యాస్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఐవోసీఎల్ ఎల్‌పీజీ సికింద్రాబాద్ డివిజనల్ సతీశ్ మాట్లాడుతూ వంట గ్యాస్ వాడకందారులు ఐదేళ్లకోసారి సురక్ష రబ్బరు ట్యూబ్ మార్చాలన్నారు. ఐఎస్ఐ మార్కు ఉన్న రబ్బరు ట్యూబ్‌ను మాత్రమే వాడాలన్నారు. విశ్రాంత ప్రధానాచార్యులు వీరయ్య, మేనేజర్ దేవేందర్, సిబ్బంది పవన్, భరత్ శరత్, భరత్ రెడ్డి, ప్రభు, దామోదర్, నర్సయ్య, చిరంజీవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మానకొండూర్ రూరల్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ సబిత అన్నారు. పచ్చునూర్‌లో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. నిలవేణి సదానందం చిన్నారులకు పలకలు అందజేశారు. కార్యదర్శి అమృత వర్షిణి, సర్పంచ్ వసంత, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మీ, మహిళలు పాల్గొన్నారు.

చెరువు పండుగను విజయవంతం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

హుజూరాబాద్‌రూరల్ : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువు పండుగను విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు.బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువు పూడికతీత అనంతరం చెరువుల అభివృద్ధి, చెరువుల ద్వారా రైతులకు కలిగిన ప్రయోజనాల గురించి సమగ్రంగా రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మీ, తహసీల్దార్ కోమల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్

శంకరపట్నం: గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గౌడసంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొడిశాల ప్రవీణ్ గౌడ్ అన్నారు. మండలంలోని కేశవపట్నంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మద్యం షాపుల్లో 50 శాతం రిజర్వేషన్లు గీతన్నలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. తాటి చెట్లు ప్రమాదాల బారిన పడితే ప్రభుత్వం కార్పొరేట్ వైద్యం అందించాలన్నారు. గీత కార్మికుల సమస్యలను పరిష్కరించే పార్టీకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మద్దతు ఇస్తామన్నారు. సమావేశంలో శివకుమార్, అభిలాష్, వంశీ, సాయి, శ్రీధర్, శివసాయి, అక్షయ్ పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యపై అవగాహన



మాట్లాడుతున్న పర్యవేక్షకురాలు రమాదేవి

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో బుధవారం మిషన్ వాత్సల్యపై ఐసీడీఎస్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ నంబర్, తదితర కార్యక్రమాలపై ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు టి. రమాదేవి అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ కవితా దేవి, వెంకటేశ్వరి, లక్ష్మి, శైలజ, అమృతమ్మ, మనీష, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

గన్నేరువరం: గునుకుల కొండాపూర్‌లోని మైలారం కుంటను కాపాడాలని ముదిరాజ్ సంఘం సభ్యులు అధికారులను కోరారు. ఈ సందర్భంగా బుధవారం తహసీల్దార్ అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. తమకు జీవనధారమైన ఈ కుంటను కొందరు రాత్రికి రాత్రే మట్టిని తరలించి పూడ్చివేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి కుంటలు, చెరువులకు హద్దులను ఏర్పాటు చేయాలని కోరారు. గూడెల్లి రాములు, బచ్చంటి శ్రీనివాస్, చొక్కాల మల్లేశం, చొక్కల తిరుపతి, చొక్కల శ్రీశైలం, గూడెల్లి లక్ష్మయ్య, మల్లయ్య, బోయిని వెంకటేశ్, బోయిని మల్లయ్య పాల్గొన్నారు.

బీమా అందజేత



బీమా నగదు అందిస్తున్న శ్రీనివాస్, వీరయ్య

తిమ్మాపూర్: మండలకేంద్రానికి చెందిన బిజిగిరి రాజయ్య ఇటీవల మృతిచెందాడు. ఉజ్వల పురుషుల పొదుపు సంఘం సభ్యుడిగా ఉండడంతో మంజూరైన బీమా నగదు రూ.17,620 సమితి అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘం అధ్యక్షుడు మాదన వీరయ్య బుధవారం కుటుంబ సభ్యులకు అందించారు కార్యక్రమంలో సంఘం సభ్యులు రమేశ, మల్లేశం, నర్సయ్య, వీరేందర్, శ్రీనివాస్, సాంబరాజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

మండు వేసవిలోనూ పుష్కలంగా నీరు



మాట్లాడుతున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- తోటపల్లి రిజర్వాయర్ ద్వారా నియోజకవర్గానికి లక్షా 7వేల ఎకరాలకు సాగునీరు
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

తిమ్మాపూర్: తెలంగాణలో ప్రస్తుతం చెరువులు, కుంటలు, కాలువలు మండువేసవిలోనూ జలకళతో కళకళలాడుతున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని అల్గునూర్‌లో సాగునీటి దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఎస్సారెస్పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు రసమయి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఒకప్పుడు తెలంగాణలో ఎటు చూసినా ఎడారిగా కనిపించేదని, ఇప్పుడు పచ్చదనంతో కళకళలాడుతోందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌తోనే ఇదంతా సాధ్యమైందన్నారు. కాళేశ్వరం నీటితో తెలంగాణ సస్యశ్యామలంగా మారిందని తెలిపారు. మానకొండూరు నియోజకవర్గానికి తోటపల్లి రిజర్వాయర్ ద్వారా లక్షా 7వేల ఎకరాలకు కాళేశ్వరం ద్వారా సాగునీరు అందుతుందన్నారు.

చెరువుల పండుగను ఘనంగా జరుపుకోవాలి..

ప్రజాసంక్షేమం కోసం చేసిన పనులను గుర్తు చేసేందుకే ప్రభుత్వం రోజుకో వేడుక నిర్వహిస్తోందని ఎమ్మెల్యే అన్నారు. గురువారం చెరువుల పండుగను ఘనంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సీఈవో ప్రియాంక, ఎస్సారెస్పీ ఈఈ, డీఈలు అధికారులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి నివేదన సభ పోస్టర్ ఆవిష్కరణ

గన్నేరువరం: ఈనెల 10న మండలకేంద్రం నిర్వహించే ప్రగతి నివేదన సభ పోస్టర్‌ను బుధవారం ఎల్ఎండీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆవిష్కరించారు. ఈ సభకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధికసంఖ్యలో హాజరు కావాలన్నారు. రాజన్న సిరిసిల్ల జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఆర్ఎస్ఎస్ మండల కో ఆర్డినేటర్ తిరుపతిరెడ్డి, కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, తిరుపతి, యువజన విభాగం మానకొండూర్ నియోజకవర్గ అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ మహిళ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను తక్షణమే పదవి నుంచి తొలిగించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రెజ్లర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ నాయకులు జక్కుల రమేశ్ యాదవ్, మద్దమల్ల కుమార్, రావుల ఓదెలు, బండ సురేశ్, క్రాంతి, గడ్డం శోభన్, బైరం సమ్మయ్య, కొలువురి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ వాఖ్యలు వెనక్కి తీసుకోవాలి'

జమ్మికుంట: క్రైస్తవులపై ఎంపీ సోయం బాబురావు చేసిన అనుచిత వాఖ్యలను తీవ్రంగ ఖండిస్తున్నామని, క్రైస్తవులకు క్షమాపణలు చెప్పాలని న్యూ విజన్ పాస్టర్స్ ఫెలోషిప్ జమ్మికుంట అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని న్యూ విజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్రైస్తవులను రెచ్చగొట్టె విధంగా మాట్లాడుతూ, మీ గుండెల్లో బులెట్లు దింపుతామని మాట్లాడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ తమ వ్యాఖ్యలను తీసుకోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి జయరాజు, కోశాధికారి ప్రసాద్ ప్రాస్టర్స్, క్రైస్తవుల పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ముందుకురావాలి

హుజూరాబాద్ రూరల్ : నియోజకవర్గ అభివృద్ధి కోసం యువకులు ముందుకు రావాలని ఐక్య విద్యార్థి యువజన కార్యాచరణ కమిటీ నాయకులు కోరారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ అభివృద్ధికి విస్తృతంగా పర్యటించి విద్యార్థి యువకులు ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషించే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. నాయకులు శ్రావణ్, కల్యాణ్, రాకేశ్, ప్రశాంత్‌యాదవ్, తదితరులున్నారు.

- నూనె ధరలు తగ్గించాలి

హుజూరాబాద్ రూరల్ : వంట నూనె ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని జేఈఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సదరు ఆయిల్ కంపెనీల యాజమానులు అధిక ధరలతో నూనె ప్యాకెట్లను విక్రయిస్తూ ప్రజలను ఆర్థికంగా నష్టపరుస్తున్నారన్నారు.